క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా...



ఆత్మకూరురూరల్: ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు పెమ్మసాని శ్రీనివాసులునాయుడు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ఎమ్మెల్సీ రోడ్డు ప్రమాదానికి గురైన నేపథ్యంలో ఆయన్ని పరామర్శించారు.

నేడు మంత్రి కాకాణి, ఎమ్మెల్యే మేకపాటి పర్యటన

సోమశిల: అనంతసాగరం మండలం ఉప్పలపాడులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ ఊరిబిండి ప్రశాంతిరెడ్డి బుధవారం తెలిపారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారని చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మహిమలూరు ప్రతిష్టను ఇనుమడింపజేయాలి



ఆత్మకూరురూరల్: మహిమలూరు ప్రాథమిక పాఠశాలలో చదివి దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తగా ఎదిగిన డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుని గ్రామ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్ ఆకాంక్షించారు. మహిమలూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ హరి, జెడ్పీ ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ అడ్డబాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా హాజరై పశుసంవర్ధక శాఖ ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రామ నాయకులు ఇందుకూరు భాస్కర్‌రెడ్డి, తదితరులు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీటీసీ ఉద్దాల పెంచలరావు, స్థానిక నాయకులు బాబుల్‌రెడ్డి, చందా హజరత్ శెట్టి, ఉపాధ్యాయులు షేక్ రసూల్‌బీ, తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి



అనుమసముద్రంపేట: మార్చి 3,4,5 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని ఏఎస్‌పేట, చిరమన పీహెచ్‌సీల వైద్యులు మంజుల, జ్యోతిరాణి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు, వలంటీర్లకు పల్స్ పోలియోపై శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఐదేళ్లలోపు చిన్నారులు 1959 మందిని గుర్తించామని తెలిపారు. వారికి పోలియో చుక్కలు వేసేందుకు 29 కేంద్రాను ఏర్పాటు చేశామని తెలిపారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రతిచిన్నారికి పోలియో చుక్కలు వేసి నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం



ఆత్మకూరు: క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని ఎస్సార్‌జేడీ కళాశాల ప్రిన్సిపల్ జీ వరకుమారి, పీడీ ఎస్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ మహీంద్రారెడ్డి సహకారంతో పట్టణంలోని ఎస్సార్‌జేడీ కళాశాలలో ప్రస్తుత, పూర్వ విద్యార్థుల మధ్యన వాలీబాల్ పోటీలను బుధవారం నిర్వహించారు. హెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆది ఆంధ్ర పాఠశాల ప్రాంగణంలో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. వాలీబాల్ పోటీల్లో విన్నర్‌గా గణేష్ జట్టు, రన్నర్‌గా శ్రీను జట్టు నిలిచాయి. హెడ్స్ సంస్థ నిర్వాహకుడు వెంకటేశ్వర్లు విజేత జట్టుకు రూ.1500, రన్నర్ జట్టుకు రూ.1000 చొప్పున నగదు అందజేశారు. అనంతరం నెహ్రూ యువ కేంద్రం ద్వారా షీల్డ్‌లు, ప్రశంసాపత్రాలను ప్రిన్సిపల్, పీడీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్‌రైట్స్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, ఆదిఆంధ్ర పాఠశాల హెచ్‌ఎం నాగేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకోవాలి



సంగంలో సైన్స్ నమూనాలను తిలకిస్తున్న ఉపాధ్యాయులు



ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో సీవీ రామన్‌కు నివాళి

సంగం: విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకోవాలని జనవిజ్ఞాన వేదిక సభ్యులు, నెల్లూరు రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల డాక్టర్ ఎంవీ రమణయ్య అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బుజ్జయ్య ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు పలు రకాల సైన్స్ నమూనాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. డాక్టర్ ఎంవీ రమణయ్య ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి సైన్స్ ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకుని శాస్త్రవేత్తలుగా ఎదిగి సమాజ అభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్ సీవీ రామన్ సైన్స్ సెంటర్ కన్వీనర్ కామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ టెక్నికల్ ఆఫీసర్ కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

సోమశిల: విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకుని దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తలుగా ఎదగాలని అనంతసాగరం మండల ఎంఈఓ బాలకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంచాలపల్లి జంగాలకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఉమామహేశ్వర్ అధ్యక్షతన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిత్య జీవితంలో సైన్స్ పాత్రను విద్యార్థులకు వివరించారు. సైన్స్ ఉపాధ్యాయిని వెంకటరమణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే అనంతసాగరం గ్రంథాలయంలో లైబ్రేరియన్ నారాయణరావు ఆధ్వర్యంలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మురగళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్, సైన్స్ ఉపాధ్యాయులు మేకల ప్రభావతి, ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో రాకెట్ ప్రయోగాన్ని విద్యార్థులకు ప్రయోగాత్మకంగా చూపారు. మహిమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయుడు అంకయ్య విద్యార్థులకు సైన్స్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం సైన్స్‌పై వివిధ పోటీలు నిర్వహించిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

చేజర్ల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ఎన్వీకండ్రిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గ్లోబల్ వార్మింగ్, వాయుకాలుష్యం, సమతుల ఆహారం, తదితర నమూనాలను ప్రదర్శించి విద్యార్థులు ఆకట్టుకున్నారు.

సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి

వరికుంటపాడు: విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వేణుగోపాల్ అన్నారు. బుధవారం పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం మాట్లాడుతూ భారత శాస్త్రవేత్త సర్ సవీ రామన్‌కు నోబెల్ బహుమతి వచ్చిన సందర్భంగా ఏటా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్‌డే జరుపుకొంటున్నామని తెలిపారు అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభద్ర, సుజాత, జయశ్రీ, సుజిత్‌కుమారి, మౌలాలి, ఉప్పు కొండయ్య, శ్రీనివాసులు, వెంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: గండిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ షేక్ రియాజ్, హెచ్‌ఎం ఎం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకించి అభినందించారు.

వింజమూరు(ఉదయగిరి): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వింజమూరులోని రవి స్కూల్‌లో సైన్స్‌ఫేర్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ నమూనాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కరస్పాండెంట్లు ఎన్ మహేశ్వరరావు, జీ శ్రీనివాసులు బహుమతులు అందజేశారు.

కలిగిరి: స్థానిక పవిత్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు అకట్టుకున్నాయి. అనంతరం ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాదాల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అనంత లక్ష్మి ఆధ్వర్యంలో సర్‌సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకుని భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదిగి నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. అనంతరం సైన్స్ నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రమీలమ్మ, లక్ష్మీకుమారి, బీసీ పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

- పట్టణంలోని శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులు 110కిపైగా సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రావణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై సైన్స్ నమూనాలను తిలకించి విద్యార్థులను అభినందించారు. విశ్రాంత ఉపాధ్యాయులు నారాయణరావు, హెచ్‌ఎం మస్తాన్‌షరీఫ్, గార్లపాటి సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరురూరల్:మహిమలూరు ఉన్నత పాఠశాలలో విజేతలకు బహుమతుల ప్రదానం



చేజర్ల: విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు



ఆత్మకూరురూరల్: మురగళ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో రాకెట్‌పై అవగాహన



ఉదయగిరి: గండిపాళెంలో పాఠశాలలో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్, హెచ్‌ఎం



సోమశిల: సీవీ రామన్ చిత్రపటానికి నివాళులు

త్వరలో శనగల కొనుగోలు కేంద్రాల ప్రారంభం



రికార్డులను పరిశీలిస్తున్న పవన్‌కుమార్

ఉదయగిరి: ఉదయగిరి ప్రాంత శనగ రైతులను దృష్టిలో ఉంచుకుని త్వరలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు జిల్లా మార్కెటింగ్ మేనేజర్ పవన్‌కుమార్ తెలిపారు. స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలిగిరి, ఉదయగిరిలో శనగల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకుంటామన్నారు. ప్రభుత్వం సూచించిన మద్దతు ధరకు శనగలను కొనుగోలు చేస్తామన్నారు. అనంతరం ఆయన మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లోని ఎరువుల నిల్వలు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆర్బీకేల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట ఏఓ బాలాజీనాయక్ ఉన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఏపీఓ శ్రీనివాసులు

ఉదయగిరి: వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉపాధి పనులు చేపట్టే ప్రదేశంలో కూలీలకు నీడ, తాగునీరు, తదితర సౌకర్యాలను కల్పించాలని ఏపీఓ శ్రీనివాసులు క్షేత్రసహాయకులకు సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బంది, క్షేత్రసహాయకులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు కొలతల ప్రకారం ప్రభుత్వం సూచించిన విధంగా గిట్టుబాటు కూలి అందేలా చూడాలన్నారు. కూలీలు సమయానికి పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు. పనులకు వచ్చిన కూలీల హాజరు మాత్రమే నమోదు చేయాలన్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి గ్రామోత్సవం



దుత్తలూరు: మండలంలోని నందిపాడు సెంటర్‌లో జరుగుతున్న అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు బుధవారం గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అభయాంజనేయస్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి పరిసర గ్రామాలైన నందిపాడు, బొటికర్లపాడు, శ్రీరామనగర్, శ్రీకృష్ణనగర్‌లో ఊరేగించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.గురువారం విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



మర్రిపాడు: మాట్లాడుతున్న ఎంపీడీఓ మనోహర్



అల్లూరు: మాట్లాడుతున్న ఎంపీపీ శశిరేఖ

మర్రిపాడు: రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ గంగవరపు లక్ష్మీదేవమ్మ, ఎంపీడీఓ మనోహర్‌రాజు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ఎంఈఓ ధనలక్ష్మి మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవితేజ మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలానికి మంజూరైన 34 పనుల్లో 20 పూర్తి చేశామని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, మండలాధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి

అల్లూరు: మండల పరిషత్ పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలనారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ వేణమ్మ, వైస్ ఎంపీపీలు గుమ్మడి సురేంద్ర, కొండూరు వాసు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం లాభదాయకం

సంగం: స్థానిక ఎంజీఎన్‌ఆర్‌జీఎస్ కార్యాలయంలో సినార్డ్ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జీపీ జవహర్ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులు, వ్యవసాయాధికారులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీహరి సేంద్రియ వ్యవసాయం లాభదాయకమన్నారు. ఈ విధానంలో ఆరోగ్యకర పంట ఉత్పత్తులను పొందవచ్చని తెలిపారు. వాటికి మార్కెట్లోనూ మంచి ధరలు లభిస్తాయని చెప్పారు. ఎరువులు, పురుగు మందులు వాడకపోవడం వల్ల పెట్టుబడులు గణనీయంగా తగ్గుతాయన్నారు. తద్వారా రైతులు లాభాలను పొందవచ్చని వివరించారు.

జాతీయస్థాయి క్రీడాకారుడికి సన్మానం



ఆత్మకూరు: జాతీయస్థాయి పెన్‌కాక్ సిలాట్ క్రీడా పోటీల్లో బంగారు పతకం సాధించిన ఆత్మకూరుకు చెందిన పీ సాయికిరణ్‌ను బీఎ స్టార్ ఫౌండేషన్ చైర్మన్ బొమ్మిరెడ్డి తారకనాథ్‌రెడ్డి బుధవారం సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని క్రీడా పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మల్లికార్జున, విశ్రాంత ఉపాధ్యాయుడు సాధిక్‌హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



ఆత్మకూరు: పట్టణంలోని ఏసీఎస్సార్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని హెచ్‌ఎం జీ హజరత్తయ్య ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయిని కోలా సుజాత తన సొంత నిధులతో విద్యార్థులకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలను అందజేశారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పెంచలమ్మ, ఉపాధ్యాయులు జే వెంగమ్మ, దమ్ము పద్మమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

ఆత్మకూరు: మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో మున్సిపల్ సాధారణ సమావేశాన్ని గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ షేక్ ఫజులుల్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మున్సిపల్ బడ్జెట్‌ను కౌన్సిలర్ల ఆమోదం కోసం సమావేశంలో ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. కౌన్సిలర్లందరూ తప్పక హాజరుకావాలని కోరారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అస్మా

ఆత్మకూరు: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా పేర్కొన్నారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. 22, 23 వార్డుల పరిధిలోని నెల్లూరుపాళెం, పేరారెడ్డిపల్లి, జ్యోతినగర్, గిరిజనకాలనీ, బీసీకాలనీ, తదితర ప్రాంతాల ప్రజలకు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తోందని తెలిపారు. అనంతరం అర్బన్ హెల్త్‌సెంటర్ డాక్టర్ షేక్ అస్మా, డాక్టర్ సుబ్రహ్మణ్యం సుమారు 600 మందికి సాధారణ, కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ సునీలత ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వైద్యులు హేమలత, సంబంధ్‌లతో పాటు ఏహెచ్ఈఓ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే



అల్లూరు: టైలర్స్ అసోసియేషన్ జెండాను ఆవిష్కరిస్తున్న దర్జీలు

అల్లూరు: మండల టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల తహసీల్దార్ కార్యాలయం నుంచి మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు దర్జీలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి టైలర్స్ అసోసియేషన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కన్యకపరమేశ్వరి కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ సభ్యులు మాట్లాడారు. మండలంలో దాదాపు 500 మంది వరకు దర్జీలు ఉన్నారని, అందరూ కలసికట్టుగా ఉండలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న చేదోడు కింద దర్జీలకు ఏటా రూ.10 వేలు అందజేయడం సంతోషకరమన్నారు. యూనియన్ సభ్యులు కావలి కృష్ణ, అబ్రహం, మహేష్, షహాబ్, శ్రీనివాసులు, రషీద్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరమ్మ, సువర్ణమ్మ, ఖాదర్ బాషా, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: టైలర్స్ డేను పురస్కరించుకుని మున్సిపల్ పరిధిలోని దర్జీలు పట్టణంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత బైపాస్‌రోడ్డులోని ఓల్డా టైలర్ షాపు వద్ద సమావేశం నిర్వహించారు. పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని రెడీమేడ్ దుస్తుల రాకతో దర్జీల జీవనోపాధి దెబ్బతిందన్నారు. ప్రతిఒక్కరూ దర్జీలను ఆదరించాలని కోరారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఐవీ రమణారెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, లక్కు ప్రసాద్, డేవిడ్‌రాజు, దర్జీలు గౌస్‌మొహిద్దీన్, రహీం, బాబు, గౌరీసుల్తాన్, సందానీబాషా, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా విశ్వేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: నందవరంలో నూతనంగా నిర్మించిన విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు దేవదేవేరుల విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఎమ్మెల్యేను అర్చకులు పూర్ణకుంభంతో ఆహ్వానించారు. మేకపాటి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. బ్రహ్మశ్రీ ఏలూరుపాటి మారుతీశర్మ బ్రహ్మత్వంలో సురభి బాల గంగాధరశర్మ, కల్లూరు రాఘవేంద్ర, కల్లూరు రామ్‌ప్రసాద్, కల్లూరు రామచంద్రయ్యశర్మ పర్యవేక్షణలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, మాజీ ఎంపీపీ కే శ్రీనివాసులనాయుడు, ఒంటెద్దు కృష్ణారెడ్డి, సిద్ధంరెడ్డి మోహన్ రెడ్డి, రామ్మోహన్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంగా శ్రీనివాసులు సేవలు మరువలేనివి



చేజర్ల: టీకేపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా కామిశెట్టి శ్రీనివాసులు అందించిన సేవలు మరువలేనివని ఎంఈఓ కళాధర్ పేర్కొన్నారు. టీకేపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసులు ఉద్యోగ విరమణ సభను బుధవారం నిర్వహించారు. ఎంఈఓ ముఖ్యఅతిథిగా హాజరై శ్రీనివాసులు దంపతులను సత్కరించారు. కలువాయి జెడ్పీటీ సీ అనిల్‌కుమార్‌రెడ్డి, చేజర్ల మాజీ ఎంపీపీ శ్రీనివాసులునాయుడు, సమగ్ర శిక్ష ఏఎంఓ సుధీర్ బాబు, హెచ్‌ఎంల అసోసియేషన్ నాయకులు సనత్ కుమార్, ఎంఈఓ-2 మస్తానయ్య, సర్పంచ్ మస్తానమ్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.